నమస్తే తెలంగాణ | DISTRICT SUPPLEMENT

# వికారాబాద్

సోమవారం 6 నవంబర్ 2023
MONDAY, NOVEMBER 6, 2023 | VIKARABAD | పేజీలు PAGES : 12



షాద్‌నగర్ రోడ్డు షోకు తరలివచ్చిన జనం

# కాంగ్రెస్‌కు ఓటేస్తే కష్టాలే..





మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

## ఆలోచించి ఓటేయండి.. జైపాల్‌యాదవ్‌ను గెలిపించండి

'బీఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేసి స్వర్ణయుగ పాలనకు బాటలు వేయాలి.. జైపాల్‌యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తే ఆమనగల్లును మరింత అభివృద్ధి చేస్తాం..ఆమనగల్లుకు రెవెన్యూ డివిజన్, ఎంవీఐ కార్యాలయం, డీఎస్పీ కార్యాలయంతో పాటు, గట్టుప్పలపల్లి, వెల్జాల్, రఘుపతిపేట మండలాలను ఏర్పాటు చేస్తాం..' అని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హామీ ఇచ్చారు. ఆదివారం ఆమనగల్లులో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో మంత్రి కేటీఆర్ పాల్గొని మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే మళ్లీ అంధకారంలోకి వెళ్తామని, కరెంటు కష్టాలు తప్పవన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ నుంచి ఇందిరాగాంధీ వరకు తెలంగాణకు అన్యాయమే చేశారన్నారు. 1956లో తెలంగాణను ఆంధ్రలో విలీనం చేసి సంపదను కొల్లగొట్టారని, 1969లోనే తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమిస్తే 369 మంది విద్యార్థులను బలితీసుకున్నది కాంగ్రెస్ కాదా అని ప్రశ్నించారు. కర్ణాటకలో ఆరు గ్యారంటీలు అమలు కాకపోవడంతో అక్కడి ప్రజలు కాంగ్రెస్‌ను ఈసడించుకుంటున్నారన్నారు. ఉవ్వెత్తున ఉద్యమం చేసి ఢిల్లీ దొరల తలలు వంచి తెలంగాణను తెచ్చుకున్నామన్నారు. రాష్ట్రం సిద్ధించాక సాగునీటి రంగంలో విప్లవాత్మక మార్పు తీసుకొచ్చామన్నారు. వ్యవసాయానికి నిరంతర విద్యుత్తును సరఫరా చేస్తూ రైతులకు అండగా నిలిచామన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో ఎన్నో గిరిజన తండాలను పంచాయతీలు మార్చామని, గిరిజన రిజర్వేషన్లను 6 నుంచి 10 శాతానికి పెంచామని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థి డబ్బు సంచులతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు. మళ్లీ ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. ఆమనగల్లులో ప్రజా ఆశీర్వాద సభ విజయవంతం కాగా, షాద్‌నగర్‌లో నిర్వహించిన మంత్రి కేటీఆర్ రోడ్డు షోకు జనం పోటెత్తారు.

– కల్వకుర్తి/ఆమనగల్లు, నవంబర్ 5

- బీఆర్‌ఎస్‌కు ఓటేస్తే అభివృద్ధి, సంక్షేమం వైపునకు..
- కాంగ్రెస్ పార్టీని నమ్మితే మళ్లీ అంధకారంలోకే..
- జవహర్‌లాల్ నెహ్రూ నుంచి ఇందిరాగాంధీ వరకు తెలంగాణకు అన్యాయమే..
- కర్ణాటకలో కాంగ్రెస్‌ను ఈసడించుకుంటున్న జనం
- ఉవ్వెత్తున ఉద్యమం చేసి ఢిల్లీ దొరల తలలు వంచాం
- రాష్ట్రం సిద్ధించాక సాగునీటి రంగంలో వినూత్న విప్లవాన్ని తీసుకొచ్చాం
- వ్యవసాయానికి నిరంతర విద్యుత్తును సరఫరా చేస్తున్నాం
- గిరిజన తండాలను గ్రామ పంచాయతీలను చేశాం
- ఆమనగల్లులో ప్రజా ఆశీర్వాద సభ సక్సెస్, షాద్‌నగర్ రోడ్డు షోకు అశేష జనవాహిని

సెంటర్ స్ప్రెడ్‌లో..



ఆమనగల్లు సభకు హాజరైన ప్రజలు, పార్టీ శ్రేణులు



కొడంగల్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ప్రముఖ న్యాయవాది చిట్లపల్లి మధుసూదన్‌రెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరగా గులాబీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న మంత్రి మహేందర్‌రెడ్డి

# చేరికల హవా..

'బీఆర్‌ఎస్ పార్టీలోకి ప్రవాహంలా వలసలు కొనసాగుతున్నాయి. ఆదివారం కాంగ్రెస్, బీజేపీ, ఇతర పార్టీల శ్రేణులు మంత్రులు, ఎమ్మెల్యేల సమక్షంలో వందలాది మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. దీంతో రోజురోజుకూ గులాబీ పార్టీ బలం, బలగం పెరుగుతుండడంతో ప్రతిపక్షాలు జీర్ణించుకోలేక కకావికలమవుతున్నాయి. బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులవుతూ అభివృద్ధిలో తాము భాగస్వాములమవుతామని చేరినవారు పేర్కొంటుండడం గమనార్హం.

– న్యూస్ నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ

- బీఆర్‌ఎస్ పార్టీలోకి కొనసాగుతున్న వలసలు
- అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులవుతున్న ఇతర పార్టీల నేతలు
- నిత్యం మంత్రులు, ఎమ్మెల్యేల సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్, బీజేపీ శ్రేణులు
- రోజురోజుకూ పెరుగుతున్న గులాబీ పార్టీ బలం, బలగం
- జీర్ణించుకోలేక కకావికలమవుతున్న ప్రతిపక్షాలు

7